క్లుప్తంగా

సేవా దృక్పథం కలిగి ఉండాలి



పంచాయతీ కార్మికులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న విక్రమ్ ఆదిత్య

పెదపూడి: సమాజంపై ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని అనపర్తిలో సన్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు విక్రమ్ ఆదిత్య అన్నారు. అనపర్తి పంచాయతీ కార్మికులకు కార్తిక మాసం గురువారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రమ్ ఆదిత్య మాట్లాడుతూ, ప్రతి ఏడాది కార్తిక మాసంలో భోజనం పంపిణీ చేస్తున్నామన్నారు.

కార్తిక వన సమారాధన



వన సమారాధనలో పాల్గొన్న సభ్యులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక రెడ్డి రామాలయం వద్ద రెడ్డి యూత్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన గురువారం ఘనంగా జరిగింది. తొలుత ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెడ్డి సామాజిక వర్గీయులతో పాటు, గ్రామస్తులంతా కలిసి ఆలయం వద్ద వన సమారాధనలో పాల్గొన్నారు. వన సమాచాధనలు సమైక్యతకు నిదర్శనమని, ప్రతి గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు జరగాలని పలువురు ఆకాంక్షించారు.

నాగమాత విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న పండితులు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నాగమాత విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వైఖానస ఆగమ పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అధ్వర్యంలో గురువారం ఉదయం 9.35కు నాగమాత విగ్రహం, పుట్ట, నాగబంధం, విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు నాగదేవత, నాగబంధాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ సమర్థంగా చేయాలి




జి.మామిడాడ-4 సచివాలయంలో ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తున్న ఈఓపీఆర్డీ

పెదపూడి: స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్ యాప్‌లో పంచాయతీలోని పన్నులు, పన్నేతర ఆదాయ వనరులన్నీ అప్‌లోడ్ చేసే ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన జి.మామిడాడ-4, పెదపూడి, పెద్దాడ గ్రామ పంచాయతీల్లో చేస్తున్న ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను గురువారం పరిశీలించారు. కొన్ని పంచాయతీల్లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ ఏ విధంగా చేయాలో అధికారులకు చూపించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి సంబంధించి అన్ని రకాల ఆదాయ వనరుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. మండలంలోని పంచాయతీల్లోని 18,577 ఇళ్ల అసెస్‌మెంట్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు వెయ్యి ఇళ్లు పూర్తి చేశారన్నారు. ఆయా పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మిర్తిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ మిర్తిపాడు, తొర్రేడు అగ్రికల్చర్ ఫీడర్లకు మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ములకల్లంక, బొబ్బిల్లంక ఉపకేంద్రం పరిధిలోని వ్యవసాయ బోర్లకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా ఉండదన్నారు.

డైరెక్టర్ కాశీవిశ్వనాథ్‌కు మాతృ వియోగం



మంగామణి

సీతానగరం: సినీ డైరెక్టర్, నటుడు వై.కాశీవిశ్వనాథ్ తల్లి యనమదల మంగామణి (79) గురువారం కన్నుమూశారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని నివాసంలో ఆమె మృతి చెందారు. ఈ విషయం తెలిసిన పలువురు సినీ ప్రముఖులు.. విశ్వనాథ్‌ను ఫోన్‌లో పరామర్శించారు.

104 సిబ్బంది ఆకలి కేకలు

- మూడు నెలలుగా అందని జీతాలు
- ఆందోళన బాటలో ఉద్యోగులు



కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతానికి వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

మధురపూడి: అందరినీ ఆరోగ్యవంతులను చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న 104 సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. వాటిని తట్టుకోలేక చివరకు సమ్మె బాట పట్టారు. రాజానగరం నియోజకవర్గంలో మండలానికి రెండు చొప్పున ఆరు 104 వాహనాలున్నాయి. ఈ వాహనాల్లో 12 మంది పనిచేస్తున్నారు. వీరంతా రాత్రీ పగలూ తేడా లేకుండా రోగులకు సేవలు అందజేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వీరిపై నిర్లక్ష్యం చూపుతోంది. మూడు నెలలుగా జీతాలు విడుదల చేయకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఉద్యమ బాట

జీతాల సాధన కోసం ఉద్యమాన్ని ప్రారంభించిన 104 సిబ్బంది రోజూ నిర్వహించే ఆందోళన కార్యక్రమాల షెడ్యూలును సిద్ధం చేసుకున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతానికి వినతి పత్రం ఇచ్చారు. అలాగే శుక్రవారం ఎమ్మెల్యే, ఎంపీలకు వినతి పత్రాలను అందజేయనున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలి

104 సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. మూడు నెలల జీతం బకాయిలను విడుదల చేయాలి. ఇంక్రిమెంట్లు, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప జేయాలి. 104 వాహనాలకు మరమ్మతులు చేయాలి.

– లక్ష్మణరావు, అధ్యక్షుడు, సీఐటీయూ

నేలకు సారం.. కాపరికి ఊతం



పొలంలో ఉంచిన గొర్రెల మంద

- గొర్రెల మందతో భూసారం పెంపు
- అధిక దిగుబడులకు ఆస్కారం
- తగ్గనున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం

బిక్కవోలు: ఖరీఫ్ పూర్తయిన ప్రస్తుతం తరుణంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రైతన్నలు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో భూసారం పెంచేందుకు రైతులు గొర్రెలు మందలను పొలాల్లో విడిచిపెడుతున్నారు. గొర్రెల పెంట ద్వారా భూసారం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. వరి చేల్లో మేత తింటున్న గొర్రెల మందను రెండు, మూడు రోజుల పాటు అక్కడే వదిలిపెడుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 3,144 గొర్రెలు, 481 మేకలున్నాయి. అలాగే బిక్కవోలులో 3,660 గొర్రెలు, 695 మేకలు, పెదపూడిలో 44 మాత్రమే గొర్రెలు, 294 మేకలు, రంగంపేట మండలంలో 3,679 గొర్రెలు, 3,139 మేకలు ఉన్నాయి.

ఖాళీ చేలలో..

ప్రస్తుతం ఖాళీ అయిన చేలలో గొర్రెలను మేపుతున్నారు. ఒక్కో మందలోనూ 150 నుంచి 200 గొర్రెలు ఉంటున్నాయి. రాత్రి వేళల్లో ఒక్కో గొర్రెల మందను ఎకరం చొప్పున కడుతున్నారు. తెల్లారేసరికి పొలమంతా గొర్రెల పెంటతో నిండి ఉంటుంది.

ఈ పొలానికి నీరు పెట్టి, దమ్ము చేయడం ద్వారా నేల సారవంతమవుతుంది. గతంలో ప్రతి ఇంటి వద్ద పశువులు ఉండడం, వాటి పెంటను వరి చేలల్లో ఎరువుగా ఉపయోగించేవారు. ప్రస్తుతం పశువుల పోషణ కూడా కష్టతరంగా మారింది. ఇలాంటి తరుణంలో ఒక్కో ఎకరానికి ఎంతో కొంత నగదు ఇచ్చి, మందలను చేలల్లో కట్టుకుంటున్నారు.

గొర్రెల మంద కట్టించాలి



వరి చేలలో గొర్రెల మందలను కట్టించడం వలన పెంట భూమిలో కలిసి నేల సారవంతమవుతుంది. దమ్ము చేసిన సమయంలో మట్టితో కలిసి నేల గుల్లబారుతుంది. ఎరువులు, మందుల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయి.

– సామ్యూల్ జాన్, వ్యవసాయాధికారి, బిక్కవోలు

మెరుగైన వైద్యసేవలు అందించాలి



పెదపూడి సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ అనూషతో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్

- కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి
- పెదపూడి సీహెచ్‌సీ పరిశీలన

పెదపూడి: సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. గురువారం ఆయన పెదపూడిలో సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు, తహసీల్దార్ కార్యాలయం, రామేశ్వరం గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. రూ.13.6 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ, డెలీవరీలు, జనరల్ సర్జరీలు ఎన్ని జరుగుతున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ పసుపులేటి అనూషను ఆరా తీశారు. నెలకు సుమారు 4,500 ఓపీ ఉంటుందని, 15 ప్రసవాలు చేస్తున్నారని, 20 జనరల్ సర్జరీలు చేస్తున్నారని ఆమె వివరించారు. ఎంతమంది, ఏ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఉన్నారు. మొత్తం సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయా, లేదా అని, ఎన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారని వివరాలు అడిగారు. మరుగుదొడ్లు, ల్యాబ్, ఫార్మసీ గదిని పరిశీలించారు. నూతనంగా నిర్మించిన ఆస్పత్రికి విద్యుత్ సౌకర్యం, తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అనూష కోరారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిన పరిష్కరిస్తానని కలెక్టర్ చెప్పారు. ఆస్పత్రి సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘన వ్యర్థాల నిర్వహణ పరిశీలన

అలాగే రామేశ్వరం గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. ఈ కేంద్రం నిర్వహణ తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ విధంగా అన్ని కేంద్రాలు పనిచేసే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట వైద్యులు హర్షవర్ధన్, సుభాష్, వరప్రసాద్, రాముడు, శ్రావణి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ లోవరాజు తదితరులు ఉన్నారు.

రాజానగరంలో ఆధ్యాత్మిక శోభ



గాయత్రీ హోమంలో పాల్గొన్న భక్తులు

- సాయిబాబా ఆలయం వద్ద గాయత్రీ హోమం
- కార్తిక వన సమారాధన
- భారీగా తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో షిరిడీ సాయిబాబా

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం గాయత్రీ హోమం, అన్న సమారాధన వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఇచ్చిన కాకడ హారతి అనంతరం వినాయకుడు, దత్తాత్రేయుడు, సరస్వతీమాత విగ్రహాలతో పాటు సాయిబాబా మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజ్యనీయులు రామానందస్వామి శిష్యపరివారం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో 11 యజ్ఞ కుండీలను ఏర్పాటుచేసి, 44 జంటలతో గాయత్రీ హోమాన్ని నిర్వహించి, పూర్ణాహుతిని సమర్పించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఐఎస్‌టీఎస్ చైర్మన్ ఉపేంద్ర రెడ్డి, తహసీల్దారు లక్ష్మీ లావణ్య, ఐఎస్‌టీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి, సీఐ ఎస్వీ వీరయ్య గౌడ్‌తో పాటు రాజానగరం, రంగంపేట, రాజమహేంద్రవరం, కోరుకొండ, గండేపల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గాయత్రీ హోమాన్ని సందర్శించి, సాయిబాబాను దర్శించి, అన్న సమారాధనలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దివ్య, గైట్ విద్యార్థులు సేవలు అందించారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ

సాయిబాబా ఆలయంలో స్థానిక రైతు నీలపాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చేసిన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలువురు తమ సెల్‌ఫోన్‌లలో ఆ అలంకరణను ఫొటోలు, వీడియోలు తీసి భద్రపర్చుకున్నారు.

ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి



అనపర్తి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద భారీ అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అయ్యప్ప స్వామి ఆలయంలో భారీ అన్నదానం

పెదపూడి: అయ్యప్ప స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండో అయ్యప్ప స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిన అనపర్తిలో అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణం పదో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. భారీఎత్తున నిర్వహించిన అన్నదానంలో అన్నదానం స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, సుమారు 40 ఏళ్ల క్రితమే అనపర్తిలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించారన్నారు. ఈ ఆలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండోదిగా ప్రఖ్యాతి గాంచిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, తేతలి త్రినాథ్ రెడ్డి, అనపర్తి గ్యాస్ కంపెనీ కర్రి సాంబశివరెడ్డి, వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, తేతలి గంగిరెడ్డి (ఎన్‌సీఆర్), బాబులు, మునీశ్వరరెడ్డి, ఎన్‌సీఆర్ కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశం

మధురపూడి: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కోరుకొండలో ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేద్దామన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాజానగరం: జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పి.సుజాత పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెదపూడి: అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఇందులో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని అనపర్తి ఎస్సై ఎల్.శ్రీనునాయక్ గురువారం తెలిపారు. ఈ దాడిలో రూ.22,080 నగదు, ఏడు మోటార్ సైకిళ్లు, ఓ కారు సీజ్ చేశామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి తీవ్ర గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై ఆదికవి నన్నయ యూనివర్సిటీ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన గార సన్నీ నన్నయ క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి రహదారిపై నడిచి వెళుతున్న అతడిని పచ్చగడ్డి మోపులతో వెళుతున్న బైకు తగులుకోవడంతో కింద పడిపోయాడు. అదే సమయంలో కాకినాడ నుంచి తెలంగాణాకు వెళుతున్న లారీ అతడి ఎడమ కాలు ఎక్కేసింది. ఈ ప్రమాదంలో సన్నీ కాలు నుజ్జునుజ్జయ్యింది. అతడిని 108లో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన రీ సర్వే సభలు



గుమ్ములూరు సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మధురపూడి: భూ సమస్యల పరిష్కారం కోసం కోరుకొండ మండలంలో నిర్వహించిన రీసర్వే సభలు గురువారంతో ముగిశాయి. అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం గురువారం గుమ్ములూరులో జరిగిన సభలో ముగిసింది. మండలంలోని 16 గ్రామాల్లో జరిగిన సభల్లో రైతులు 1,172 దరఖాస్తులు ఇచ్చారు. వీటిలో భూమి సమస్యలపై 294, రీ సర్వేకు సంబంధించినవి 878 ఉన్నాయి. ఈ సభలకు రైతులు ఆశించినంత సంఖ్యలో హాజరుకాలేదు.

కార్తిక దీపోత్సవం



దీపాలను వెలిగిస్తున్న భక్తులు

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పలువురు మహిళలు ఓంకారం, స్వస్తిక్, శివలింగం, త్రిశూలం ఆకారాలలో దీపాలను వెలిగించారు. ఫరిజల్లిపేటకు చెందిన భజన మండలి ఆధ్వర్యంలో భజన జరిగింది.

దోషులను కఠినంగా శిక్షించాలి



పుట్టకొండలో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదపూడి: విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పుట్టకొండ గ్రామంలో గురువారం సీఐటీయూ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలు, పిల్లలపై దాడులు, లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలను పూర్తిగా నిషేధించాలన్నారు. మద్యం మత్తులో అనేక మంది ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. జస్టిస్ వర్మ సిఫార్సులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల ప్రతినిధి జి.ఈశ్వరమ్మ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలి

డీడీఏ సంజయ్‌కుమార్



జి.మామిడాడలో ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

పెదపూడి: ఎరువులు, పురుగు మందులను నిబంధనల ప్రకారం విక్రయించాలని పెద్దాపురం రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సంజయ్‌కుమార్ అన్నారు. జి.మామిడాడ, దోమాడ, కైకవోలు గ్రామాల్లో ఏఓ టీవీఆర్ మణిదీప్‌తో కలిసి ఆయన ఎరువులు, పురుగు మందుల షాపులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అందుబాటులో ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండాలని వాటి నిల్వలు, సరఫరాను తనిఖీ చేశామన్నారు. షాపుల వద్ద ఎరువుల ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. విత్తనాల మొలక శాతం చూసుకుని రైతులకు సరఫరా చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు విక్రయించిన వెంటనే రైతులకు సంతకం చేసిన బిల్లులు ఇవ్వాలన్నారు. ఎరువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



కొంకుదురులో బహుమతులు అందుకున్న విద్యార్థులు

బిక్కవోలు: వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ, పుస్తక పఠనంతో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని చెప్పారు. గ్రంథాలయాధికారి ఎస్ బాల మాట్లాడుతూ, నేటి ఆధునిక యుగంలో డిజిటల్ లైబ్రరీని ఉపయోగించుకుని విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వరరెడ్డి, శ్రీకృష్ణసాయి, లక్ష్మణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ



ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామి

సీతానగరం: కార్తిక మాసం సందర్భంగా ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామికి గురువారం లక్షపత్రి పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి విజయ్ కుమార్, కొడమంచిలి వినేష్ కుమార్, తన్నీరాజుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం రాత్రి 7 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.